24న కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 24వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంట కల్లా తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

సాగులో కొత్తదనం

- సాంకేతిక వ్యవసాయం వైపు.. రైతన్న చూపు..
- డ్రోన్ ద్వారా మందులు పిచికారి
- నూర్పిడి యంత్రాలకు పెరిగిన డిమాండ్
- తగ్గిన ఖర్చుతోపాటు సమయం ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు

ప్రజాశక్తి- నగరి (విజయపురం)

వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం వేగంగా పెరుగుతున్నది. సమయం, శ్రమ, ఖర్చు ఆదా కావడం, కూలీల కొరత తీరుతుండడంతో గ్రామీణ ప్రాంత రైతులు పంటల సాగులో యాంత్రీకరణపై ఆసక్తి చూపుతున్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ అధునాతన పద్ధతులకు అలవాటుపడుతున్నారు. వ్యవసాయంలో నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకినట్లయితే డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారి చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీని ద్వారా సకాలంలో సత్వరమే పిచికారి చేసేందుకు వీలుంది. పంటల సాగులో పెట్టుబడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గడంతో రైతులకు వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయి. నష్టాలను అధిగమించి ఆదాయం ఆర్జించేందుకు రైతులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఆ దిశగా ముందుకు వెళుతున్నారు.

మందుల పిచికారికి దొరకని కూలీలు

పంటలు సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం. పంటలు సాగు చేసిన 20రోజుల నుంచే మందులను పిచికారి చేయాల్సి వస్తోంది. ప్రస్తుం పురుగు మందులు పిచికారి చేసేందుకు కూలీలు దొరకడం లేదు. పంటలు సాగు చేశాక ఎన్ని రోజులకు మందు పిచికారి చేయాలో ఆ సమయానికి రైతులు మందులను పంటలకు పిచికారి చేయలేకపోతున్నారు. ఇందుకు కూలీలు దొరకకపోవడమూ ఓ కారణం, సకాలంలో మందులు పిచికారి చేయకపోతే సాగులో నష్టాలను చూడాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు. అంతేకాక కూలీలతో మందులను పిచికారి చేయడం ఖర్చుతో కూడుకుంది. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టపోతున్నారు.

తక్కువ ఖర్చుతోపాటు సమయం ఆదా

పంటల సాగులో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా అవుతోంది. దీని ద్వారా అనుకున్న సమయానికి పంటలకు మందులను పిచికారి చేయవచ్చు. ఇందుకు ఎకరాకు కేవలం రూ.500లు తీసుకుంటున్నారు. అదే కూలీతో మందు పిచికారి చేసేందుకు ఎకరాకు ముగ్గురు కూలీలకు రూ.1500లు ఖర్చు, సమయం ఎక్కువ అవుతోందని రైతులు అంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత రైతులు డ్రోన్ ద్వారా పిచికారి చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నూర్పిడి యంత్రాలకుపెరిగిన డిమాండ్

వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పొలాల్లో తేమ ఎక్కువగా ఉండడంతో కూలీలు కోతలకు రావడంలేదు. దీనికి తోడు పైర్లు నేలవాలి పోవడంతో కోతకు ఇబ్బందిగా మారింది. దీంతో నూర్పిడి యంత్రాల కోసం రైతులు పరుగులు పెడుతుండటంతో యంత్రాలకు డిమాండ్ పెరిగింది. రోజు కూలీ రూ.350 నుంచి 400కు చేరుకుంది. ఎంత లేదన్నా ఎకరాకు 5 నుంచి 6 మంది కూలీలు అవసరం, సమయం కూడా ఎక్కువే. ఇదే సమయంలో వరి నూర్పిడి యంత్రాలకు ఎండిన నెలపై వరి నూర్పిడి చేయడానికి గంటకు రూ. 2000, తేమ పొలంలో నూర్పిడి చేయడానికి రూ.3000 వరకు బాడుగ తీసుకొంటున్నారు.

సాగు కష్టం లేదు

- రాఘవయ్య, రైతు, పన్నూరు.

నేను 5 ఎకరాలు వరి సాగు చేశాను. మందులు పిచ్చాకారి చేయడానికి కూలీలు దొరక్క చాలా కష్టపడ్డాను. అధికారుల సూచన మేరకు డ్రోన్ సాయంతో గంటలోపు 5 ఎకరాకు మందులు పిచ్చికారీ చేశాను. ఎంతో ప్రయోజకరంగా ఉంది.

రైతులకు సబ్సిడీ డ్రోన్

- రజిని కుమారి, ఏవో, విజయపురం

డ్రోన్ రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వరి, వేరుశనగ, ఉద్దులు, మామిడి తదితర పంటలకు మనుషుల చేత మందులు పిచ్చికారీ చేయడం చాలా కష్టం. డ్రోన్ ద్వారా ఈజీగా, తక్కువ ఖర్చుతో మందులు పిచ్చికారీ చేయవచ్చు. సమయం, డబ్బుతో పాటు నీళ్లు కూడా ఆదా అవుతుంది. 5 మంది రైతులు గ్రూపుగా ఏర్పడి అర్జీ పెట్టుకుంటే డ్రోన్ అందిస్తాం.

వేసవి దాహార్తి తీరేనా..

తాగునీటి కష్టాలు తప్పవా..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వేసవి ప్రారంభంలోని దంచికొడుతున్న ఎండలతో జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటికష్టాలు మొదలైయ్యాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, రూరల్ వాటర్ సప్లైయ్ అధికార్లతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలున్నయో గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు చేశారు.

మార్చి మొదటి వారంలోనే జిల్లాలో 308 చేతిపంపులు మరమ్మతులకు గుర్తైయ్యాయి. 190 పైపులైన్స్ లీకేజీలు గుర్తించారు. 225 పంపు సెట్లు మరమ్మతు చేయాల్సి ఉంది. ట్యాంకర్ల ద్వారా 4 హెబిటేషన్స్‌కు, వ్యవసాయ పంపు సెట్లు టైఅప్ ద్వారా 3 హెబిటేషన్స్‌కు నీటిసరఫరా చేస్తున్నారు. చిత్తూరు నగర పాలక సంస్థలో 7 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని వివిధ మున్సిపాటీలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే నీటి సమస్యలు మొదలైయ్యాయి. మున్సిపాటిలీ, గ్రామ పంచాయతీ బోర్లు మరమ్మతులకు గురికావడంతో నీటి కోసం వ్యవసాయ బావులు, పంపుసెట్ల వైపు పరుగులు తీయాల్సి వస్తోంది. మండల పంచాయతీరాజ్ ఏఈ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు సమన్వయంతో ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. ఈ శాఖల సమన్వయలోపం ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రత లేక అపరిశుభ్రమైన నీటిని తాగాల్సి వస్తోంది. ట్యాంకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి బ్లించింగ్ అనతరం ఫోటోలతో జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఇందులోనూ పాత ఫోటోలతో మ్యానేజ్ చేస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మరమ్మతులకు గురౌతున్న బోర్లును కాలయాపన చేయకుండా వెంటనే మరమ్మతులు చేసి ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడంతో పాటు వేసవిలో నీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం (ఫైల్)

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి

కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఏ సమావేశపు మందిరంలో స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై కమ్యూనిటీ రిపోర్ట్ పర్సన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ సంఘాల సభ్యుల ఆర్థిక అక్షరాస్యత సాధించడానికి కృషి చేయాలన్నారు. సంఘం, అందులోనే సభ్యులకు ఆర్థిక ప్రణాళిక పొదుపు, ఆవశ్యకత ఖర్చులు చేయడం పరిపక్వ రుణాలు పొందడం డిజిటల్ లావాదేవీలు సామాజిక భద్రత ఇన్సూరెన్స్‌పై అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలోని మైక్రోఫైనాన్స్ సంస్థలను నియంత్రించి సంఘ సభ్యులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ కుమార్, కమ్యూనిటీ రిసార్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై చొరవ చూపండి

ఎమ్మెల్యే మురళీమోహన్

ఆర్‌డిఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి, పూతలపట్టు, ఐరాల, బంగారుపాళ్యం, తవణంపల్లి నియోజవర్గాల పరిధిలోని ఐదు మండలాల్లో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కరించడంలో చొరవ చూపాలని ఎమ్మెల్యే మురళి మోహన్ చిత్తూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులకు విన్నవించారు. ఇటీవల జరిగిన ఈ సర్వేలో రెవెన్యూ సమస్యలు అధికంగా వచ్చాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎస్సీ, ఎస్టీలు ఇళు లేకుండా చాలామంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వారికి ప్రభుత్వ భూములున్న చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. యాదమరి టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు మొరార్జీ, రబ్బీ, పూతలపట్టు మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి పాల్గొన్నారు.

అల్జిటెక్‌కు 41 మంది విజయం విద్యార్థులు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో విజయం అధినేత తేజోమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రముఖ బహుళ జాతి సంస్థ అయిన 'అల్జిటెక్' వారు శుక్రవారం నగరంలోని స్థానిక మిట్టూరులో గల విజయం సైన్స్ అండ్ ఆర్ట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తుది ఫలితాలు శనివారం విడుదల చేశారు. అందులో తమ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న బి.కాం, బిసిఏ విద్యార్థులు 41 మంది ఎంపికయినట్లు సంస్థ అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు గ్రూప్ డిస్కషన్, ఆపరేషన్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ అను ప్రక్రియల ద్వారా నిర్వహించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2,25,000లు వార్షిక వేతనంగా అందిస్తుందని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకబృందం అభినందించారు.

నాణ్యత డొల్ల.. రోడ్డు గుల్ల

- వాహనదారులకు తప్పని అవస్థలు
- తరచూ ప్రమాదాలు
- రిపేరు అవుతున్న వాహనాలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు

మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీలోని అగ్రహారం గ్రామం నుండి కొత్త వెంకటాపురం ఆదిఆంధ్రవాడ వరకు ఉన్న రోడ్డు కంకర తేలి గుంతలమయం కావడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీంతో ఈదారిలో ద్విచక్ర వాహనాలు, పాలు వ్యాన్‌లు, కార్లుతో పాటు చిత్తూరు – కొత్త వెంకటాపురంకు ఆర్టీసీ బస్సులకు కూడా అప్పుడప్పుడు టైర్లు పంక్చర్ కావడం, షేక్ ఆఫ్ స్ప్రింగ్లు, ప్లేట్‌లు ఇరిగిపోయి వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటరు మేర రోడ్డు గుంతలమయంగా కంకరతేలి ఉంది. నిత్యం తమిళనాడు చెన్నైకు రాకపోకలు సాగేంచే ఈరోడ్డులో ఇంత అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా ఈ గుంతల రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

కంకర తేలి గుంతలు పడిన అగ్రహారం నుండి తమిళనాడు పొన్నై రోడ్డు

ప్రయాణం చేయడానికి వీలుకాని స్థితిలో ఉన్న రోడ్డు

108 రావాలన్నా ఇబ్బందే..

- శ్రీబాబు, సర్పంచ్, తూగుండ్రం పంచాయతీ

చుట్టుపక్కల గ్రామాలకు తమిళనాడులోని పొన్నై పట్టణంకు ఈ రోడ్డులో దగ్గర్లో ఉండటంతో రైతులు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, ప్రజలకు అవసరమైన వస్తువులకు కొనుగోలు నిత్యం ఈ మార్గంలోనే వెళ్లి వస్తుంటారు. అంతేకాకుండా వేలూరు సిఎంసి, చెన్నైకి సైతం దగ్గర దారి కావడంతో ఎక్కువ మంది ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. అటువంటిది ఈ రోడ్డులో రాత్రిపూట వెళ్లాలంటే ప్రమాదాలు తప్పవంటున్నారు స్థానికులు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ వెళ్లాలంటే రావాలన్నా మార్గంలో నరకయాతన పడాల్సిందే అని వాపోతున్నారు.

వర్షం పడితే ఇక అంతే సంగతి

- సుధాకర్ నాయుడు, రైతు, గెరిగలపల్లి

మామూలుగానే ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సిందే. ఇక వర్షం పడితే నరకయాతన తప్పదు. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి, బురదమయంగా మారి అవస్థలు పడాల్సిందే. తమిళనాడు రాష్ట్రం సరిహద్దు కావడంతో కొన్ని వస్తువులు, సరుకులు తక్కువ ధరలు ఉంటాయని కొనుగోలు చేయడానికి తమిళనాడులోని పొన్నైకు వెళ్లి వస్తుంటాం. అలాగే రాణిపేట, వేలూరు సిఎంసి హాస్పిటల్‌కి వెళ్లాలంటే ఈ రోడ్డులో వెళ్లాల్సిందే. ఈ రోడ్డు ఇందరి ప్రజలకు ఉపయోగంగా ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నాశిరకంగా వేసిన రోడ్డులు కంకర తేలి గుంతలు పడి రెండు కిలోమీటర్లు అధ్వానంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.

డ్రగ్స్ నియంత్రణకు కార్యాచరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

యువత డ్రగ్స్ భారినపడకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయం తో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి రెవెన్యూ, విద్యాశాఖ, ఆర్టీసీ, సంబంధిత శాఖలతో నార్కోటిక్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందుకు పోలీసు, రెవెన్యూ, విద్యా, ఆర్‌టిసి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆర్డీఓలు, డిఎస్‌పిలు సంయుక్తంగా వారి పరిధిలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు, కళాశాలలో యువత మత్తుపదార్థాలకు బానిస కావడం ద్వారా ఎదుర్కొనే చట్టపరమైన సమస్యల గురించి వివరించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు పనిచేసే స్వచ్ఛంద సంస్థలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలన్నారు. గతంలో ర్యాగింగ్‌ను నియంత్రించేందుకు యాంటీ ర్యాగింగ్ కమిటీలు జూనియర్ కళాశాలలు, కళాశాలలో పనిచేసేవని ఆ విధంగానే యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు కావాలని ఆదేశించారు. మండలస్థాయిలో ఎంఈఓలు, పోలీసుశాఖ సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ప్రధానంగా హైస్కూల్ విద్యనభ్యసించి విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన పెంచాలన్నారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు మానసిక వైద్య నిపుణులను ఏర్పాటు చేయాలన్నారు. చిత్తూరు జిల్లాకు సరిహద్దుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉండడంతో ఇతర రాష్ట్రాల నుండి డ్రగ్స్ జిల్లాకు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ అధికారులు చెన్నై, బెంగళూరు నుండి వచ్చే ఆర్‌టిసి బస్సుల్లో తనిఖీలు నిర్వహించాలని, ఎటువంటి సమాచారం అయినా పోలీసు వారికి తెలపాలని దీనిని రహస్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖకు ప్రజలు సహకారం కూడా అవసరమని, చిన్న పిల్లలకు కూడా చాక్లెట్స్ రూపంలో మత్తుకు బానిసలను చేసే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఈ విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కలదని లేదా సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందివ్వాలని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు రానున్న 45 రోజుల్లో జిల్లా యంత్రాంగంతో పోలీస్‌శాఖ సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. వేసవి సెలవులు రాక మునుపే హైస్కూల్ స్థాయిలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. మందుల షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వరాదనే ఈవిషయంలో సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, జిల్లావ్యాప్తంగా ఈనెల 21న మందుల షాపుల్లో విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ వారిచే దాడులు కూడా నిర్వహించడం జరిగిందని, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి శ్రీనివాస్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగిసిన సదరం క్యాంపు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రెండు రోజులు పాటు జరిగిన సదరం క్యాంపు శనివారం విజయవంతంగా ముగిసింది. కడా ఆధ్వర్యంలో జరిగిన మెగా సదరం క్యాంపులో భాగంగా శనివారం రెండవ రోజు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. క్యాంపులో పాల్గొనే ప్రజల కోసం క్యాంపు నిర్వహకులు ఏర్పాటుచేసిన సౌకర్యాల గురించి, ప్రత్యేక ప్రతిభావంతుల అవసరాల గురించి ఆరా తీశారు. క్యాంపులో పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు వహించాలని ఎమ్మెల్సీ అధికారులకు సూచించారు. ఈ శిబిరానికి మొదటి రోజు 2571 హాజరు కాగా, రెండవ రోజు 2504 హాజరు అయ్యారని, మొత్తం 5175 మంది ప్రత్యేక ప్రతిభావంతులు హాజరైనట్టు అధికారులు తెలిపారు. వీరందరినీ వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించారని, అర్హులందరికీ ధ్రువపత్రాలు అందించనున్నట్టు తెలిపారు. పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌బాబు, సభ్యులు కన్నన్, బెండనకుప్పం బాబు, రాజారామ్, మంజునాథ్, జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ సోము పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో

చిత్తూరును మొదటి స్థానంలో నిలపాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షన్‌లో చిత్తూరు నగరాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు నగర ప్రజలందరూ ఓటు చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం చిత్తూరు నగరపాలక సంస్థ రూపొందించిన స్వచ్ఛ సర్వేక్షన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జరిగే స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో నగర ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు. రెండు నిమిషాలు సమయం వెచ్చించి చిత్తూరు నగరం కోసం స్వచ్ఛ సర్వేక్షన్ యాప్, లింక్ ద్వారా, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఓటు చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్లో మెరుగైన ర్యాంక్ సాధించడం ద్వారా పారిశుద్ధ్యపరంగా మరింత మెరుగైన సౌకర్యాలను పొందవచ్చు అన్నారు. మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షకు 166 మంది హాజరు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా నాలుగవ రోజు సంస్కృతం పరీక్షకు ఐదు కేంద్రాల్లో మొత్తం 167 మంది విద్యార్థులకు 166 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఈఓలు లీలారాణి బాల సుందరం తెలిపారు.

సంతను పరిశీలిస్తున్న పోలీసులు

సంతను పరిశీలించిన సీఐ

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని శనివారం నిర్వహించిన సంత ను సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతలో చోరీలు, అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై రద్దీ లేకుండా చూసేందుకు వాహనాలను క్రమ పద్ధతిలో ఉంచుకునే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి , కానిస్టేబుల్ సురేంద్ర, ద్వారకనాథ్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులు ఢీకొన్న దృశ్యం

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు బస్టాండ్‌లో శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తృటిలో ప్రమాదం తప్పింది. పలమనేరు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సును వెనక్కు తీసే క్రమంలో కుప్పం డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్ ఢీ కొంది. రెండు బస్సుల్లో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎవరికీ ఏమీ ప్రమాదం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్టాండ్ ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో బస్సులు తిప్పుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం: టిడిపి

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్ : టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం చిత్తూరు నియోజకవర్గ టిడిపి విస్తృతస్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశంలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

26న వారపు సంత, పంచాయతీ రూముల వేలం

ప్రజాశక్తి- పూతలపట్టు: ఈనెల 26వ తేదీ పూతలపట్టు పంచాయతీకి సంబంధించి వారపు సంత, 11 రూములో వేలం వేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ శనివారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనాలనుకున్న వారు వారపు సంతకు రూ.1,50,000, రూములకు రూ.66,000 వేలు నగదు రూపంలో వేలంపాటకు నాలుగు గంటల ముందు డిపాజిట్ చేయాలని ఆయన తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అభిమానికి బాలకృష్ణ పలకరింపు

ప్రజాశక్తి -గుడిపల్లి:

గుడిపల్లి మండలం బాలకృష్ణ వీరాభిమాని, టిడిపి మండల ఉపాధ్యక్షుడు మూర్తి యాదవును శనివారం హిందూపురం ఎమ్మెల్యే , సినీ యాక్టర్ బాలకృష్ణ ఫోను ద్వారా పలకరించారు ఇటీవల నెల క్రితం మూర్తి యాదవ్ ప్రమాదవశాత్తు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో విషయం తెలుసుకున్న ఆయన పలకరించి ఆర్థిక సాయం చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో మూర్తి యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌ను సత్కరిస్తున్న వాల్మీకిసంఘం నాయకులు

భాస్కర్‌కు సత్కారం

ప్రజాశక్తి- పలమనేరు:

పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్ భాస్కర్ ను, శనివారం సాయంత్రం పలమనేరులో వారి ఆఫీస్‌లో వాల్మీకి సంఘం నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పదవులు మరెన్నో చేపట్టాలని, కాలేజీ రోజుల్లోనే, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి లో భాగస్వాముడై, అనేక కార్యక్రమాలు చేశారని, ఆంధ్రప్రదేశ్ లోనే గాక, తెలంగాణ, తమిళనాడు ఢిల్లీ, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో విఆర్పిఎస్ గొంతుకు వినిపించారని, ఆనాటి రక్షణ మంత్రి భూటాసింగును కూడా మీటింగ్ కు పిలిచి, ఆయన ముందు తమ గొంతుక వినిపించాడని, చాలా మంది ఉన్న పలమనేర్ బార్ అసోసియేషన్ లో, ఎల్.భాస్కర్ ను, ఈ పదవి వరించడం వెనుక ఆయన కృషి, సామరస్య ధోరణి, కలుపుగోలు తనంవల్లే ఈ పదవి వచ్చిందని, ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులు ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. ఎల్ భాస్కర్ మాట్లాడుతూ తనపై ఇంత అభిమానం చూపిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటు న్నానన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు అద్దాల నాగరాజు, మాజీ సర్పంచులు ఓ. గంగప్ప, చలపతి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, మాడి శంకరప్ప, పొట్టగానిపల్లి నగేష్ పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు..

ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సిఐ హెచ్చరిక

ప్రజాశక్తి-పెద్దపంజాణి: యువత ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని గంగవరం సిఐ మురళీమోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెట్టింగులతో డబ్బులను పోగొట్టుకొని మానసిక ఒత్తిడికి గురవుతారని, నిరాశ, ఆత్మన్యూనత భావాలతో చివరికి ఆత్మహత్యా యత్నాలకు దారితీస్తాయన్నారు. బెట్టింగులకు పూర్తి సమయాన్ని కేటాయిం చడం వల్ల కుటుంబ సభ్యులు, స్నేహితులకు దూరం కావడమే కాకుండా, విలువైన సమయాన్ని వృథా చేస్తూ, అభివృద్ధికి దూరమవుతారని సిఐ అన్నారు. ఈ తరహా బెట్టింగు యాప్‌లు వినియోగించడం, ఆఫ్ లైన్ బెట్టింగులకు పాల్పడడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ పరిధిలో రాయలపేటకు చెందిన చంద్రబాబు, బంధువులు ఈ తరహా బెట్టింగ్ యాప్‌లు నడిపిస్తున్నారని దీనిపై పెద్దపంజాణి మండలం నేలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 70 లక్షలు బెట్టింగ్‌లో పోగొట్టు కున్నాడని కేసు సైతం నమోదు చేశామన్నారు. ఈ తరహా కేసుల్లో నిందితులపై న్యాయస్థానాల్లో నేరం రుజువైతే జైలు శిక్షలతో పాటు, పెద్ద మొత్తంలో జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాప్‌ల జోలికి పోవద్దని ,బెట్టింగు లతో డబ్బులు సంపాదించవచ్చన్న పేరాశతో బెట్టింగులకు పాల్పడే కంటే ఆర్థిక భద్రత కోసం కష్టపడి పని చేయడం, న్యాయబద్ధంగా సంపాధించిన నగదును సద్వినియోగం చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రజలకు సూచించారు. ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ బెట్టింగులకు పాల్పడే వారి సమాచారాన్ని డయల్ 112 , 100 లేదా 9491074521కి సమాచారం అందించా లని ప్రజలను ఆయన కోరారు.

పెట్రోలు బంకు ఏర్పాటును పరిశీలిస్తున్న జైళ్ల శాఖాధికారులు

పెట్రోల్ బంక్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పలమనేరు:

పలమనేరులో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను కడప రేంజ్ డీఐజీ రాజేశ్వర్ రావు శనివారం పరిశీలించారు. పలమనేరులో ఐఓసీయల్ సహకారంతో ఖైదీలచే పెట్రోల్ బంక్ నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌పనులను ఆయన జిల్లా జైళ్ల శాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డితో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం

ప్రజాశక్తి -పలమనేరు:

పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యా లయ భవనంలో శనివారం సాయంత్రం జిల్లా ఏపిజిఇఎ అసోసియేట్ అధ్యక్షులు బాలాజీ రెడ్డి , జిల్లా విఆర్‌వోల సంఘం అధ్యకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో పలమనేరు రెవెన్యూ డివిజన్, గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించారు. ఇందులో పలమనేరు డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు.

లీజుకు దేవస్థానం భూమి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

ఈనెల 26న బుధవారం ఉదయం 10:30 గంటలకు గ్రామంలో స్థానిక కట్టమంచి గ్రామంలో ఉన్న వరదరాజుల స్వామి దేవస్థానం భూములను లీజుకు ఇవ్వనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు వెయ్యి రూపాయలు డిడి రూపంలో చెల్లించాలని హెచ్చుపాట పాడిన డిపాజిట్ దారుడికి తప్ప ఇతరులకు డిపాజిట్ సొమ్మును తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు. డిపాజిట్ కాలం పూర్తయిన తర్వాత ఎలాంటి వడ్డీ లేకుండా వాపసు ఇవ్వబడును తెలిపారు. వేలంపాట నిలుపుదల చేయుటకు వాయిదా వేయడానికి కార్యనిర్వాహణాధికారికి పూర్తి అధికారం ఉంటుందన్నారు. పాత బకాయిలు, కోర్టు వ్యవహారాలు, దేవస్థానానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు ఉన్నవారు వేలంపాటలో పాల్గొనే అవకాశం లేదని తెలిపారు.

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు..

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అక్రమ కేసులకు తాను భయపడేది లేదని మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి అన్నారు. గురువారం ఎస్ఆర్ పురం మండలం పొదలపల్లి వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో గాయపడిన వెదురుకుప్పం మండలం, ఎలమంద గ్రామానికి చెందినవారు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని నారాయణస్వామి శనివారం పరామర్శించారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులకు భయపడి విదేశాలకు పారిపోయాడంటూ కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. రాజకీయ సుదీర్ఘ అనుభవంలో అవినీతి మచ్చలేని తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి సాధించాలే కానీ, కక్షపూరిత చర్యల్లో భాగంగా వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు.

నియామక పత్రాలు పంపిణీ

నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి చేతుల మీదుగా శనివారం పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందించారు. ఆ మేరకు వీ కోట మండలంలోని నారాయణనగర్ అంగన్‌వాడీ టీచర్‌గా రాజేశ్వరి, బైరెడ్డిపల్లి మండలం ధర్మపురి అంగన్‌వాడీ హెల్పర్ గా రేణుకలు నియమి తులయ్యారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే కార్యా లయంలో సిడిపిఓ అరుణశ్రీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నియామక పత్రాలను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, వీ కోట మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్ ఉన్నారు.

రైతు సమస్యలపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే

తహశీల్దారుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు మండల పరిధిలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, నిత్యం రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారని వంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన తహశీల్దారు కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దారు రమేష్ బాబుతో పాటు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ సభల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించాలని తెలిపారు. ప్రజలు సమస్యలపై ప్రభుత్వ కార్యాలయం చుట్టూ ప్రదర్శనలు చేయకుండా వారి సమస్యలను పరిష్కరించే విధంగా సహకరించాలని కోరారు. అనంతరం తహశీల్దారు ఎమ్మెల్యే ను సన్మానించారు. ఆయన వెంట మండల కన్వీనర్ దొరబాబు ఇతర నాయకులు ఉన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించి ప్రయాణిస్తే చర్య: ఎస్ఐ

మాట్లాడుతున్న ఎస్ఐ సుమన్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : చట్టాన్ని ఉల్లంఘించి వాహనాల్లో రోడ్డుపై ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుమన్ శనివారం విలేకరులతో మాట్లా డుతూ ఎస్ఆర్ పురం మండల పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురై ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతు న్నాయని, ఈ నిరంతర ఘటనలు బాధిత కుటుంబాలను, అధికారులను తీవ్రంగా కలచి వేస్తోంద న్నారు. ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టరు థామస్, ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పోలీసు, రవాణాశాఖల్లో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే తమకు ముఖ్యం అన్నారు. అలా కాదని ప్రయాణిస్తే.. వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుండి రహదా రులపై స్కూటర్‌పై ప్రయాణించాలంటే.. హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, ఇద్దరు వ్యక్తులకు పైగా ప్రయాణించ కూడదని ఆయన సూచించారు. కారులో ప్రయాణించే వారు డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించి నియంత్రణ వేగంతో మాత్రమే ప్రయాణించాలని సూచించారు. లకేజీ ఆటో, టాటా ఏస్ తదితర వాహనాల్లో పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తే.. వారిపై శాఖపర మైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేకంగా పుత్తూరు -చిత్తూరు జాతీయ రహదారిపై ఎస్ఆర్ పురం మండల పరిధిలోని ప్రయాణికులు దీన్ని గుర్తించాలన్నారు.

ప్రతి ఇంటికీ నీటి సరఫరా: ఎమ్మెల్యే

తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో ప్రతి ఇంటికీ నీటి సరఫరా చేస్తామని, ఇందుకు అవసరమైన పనులు వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో దుర్గా నగర్ కాలనీలో తెలుగు యువత అధికార ప్రతినిధి వరుణ్ ఏర్పాటు చేసిన ఉచిత నీటి సరఫరా ట్యాంకర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ వాసులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నగరపాలక పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామ న్నారు. అడవిపల్లి పైప్ లైన్ గురించి శాసనసభలో ప్రస్తావించానని ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నీటి కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పైప్‌లైన్ పనులు వేగంగా జరుగు తున్నాయని, కలెక్టర్ దీనిపై శ్రద్ధ తీసుకుం టున్నారని త్వరలోనే ప్రత్యేక సమావే శం నిర్వహించి పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ నీరు అందిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తెలుగు యువత అధికార ప్రతినిధి వరుణ్, టిడిపి సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, అశోక్, చిట్టిబాబు, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జిలు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి -యాదమరి: బంగారుపాళ్యం ప్రాజెక్టు పరిధిలోని యాదమరి మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీపీఓ వాణిశ్రీ ఆధ్వర్యంలో పోషన్ బీ, పడాయి బీపై మూడు రోజుల శిక్షణలో భాగంగా పెను గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. పోషణ, విద్య గురించి ఆదర్శిల, నవచేతనపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించేలా పిల్లల తల్లిదండ్రుల వద్ద ఒప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వాణిశ్రీ, సూపరువైజర్లు లలితా, కవితా, సరళ కుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

యాదమరిలో

బంగారుపాళ్యం: పిల్లల సమగ్ర అభివృద్ధికి పిబి పిబి (పోషణ బి పడాయి బి) అని సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. మండలంలోని మొగలిమిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్‌బి, పడాయిబి శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్ వాడి లలో పిల్లల సమగ్రాభివృద్ధికి, ఆటపాటల విద్యపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. వీటి ద్వారా అంగన్‌వాడీలు పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్లు జయశ్రీ, రెడ్డి కళ్యాణి మొగిలి, చీకురుపల్లి సెక్టారులోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో

గంగాధర నెల్లూరు: మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గంగాధర నెల్లూరు మండలంలో సిడిపిఓ వినత శ్రీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు శనివారం శిక్షణ ఇచ్చారు. గంగాధర నెల్లూరు మండలంలోని అంగన్ వాడీలకు ఐసిడిఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు చిన్నారుల అభివృద్ధిని నిర్ధారించడానికి నూతన విద్యా విధానం ద్వారా చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పే విధానం పైన శ్యామ్, మ్యాప్ పిల్లల గ్రోత్ పైన సూక్ష్మ పోషక లోపాలు, పోషణ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతుల గురించి మానసిక ఆరోగ్య స్థితులపై మెరుగుపరచుటపై శిక్షణ అందించారు. ఈ శిక్షణలో సిడిపిఓ వినత శ్రీ, సూపర్వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, పలువురు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మునిరాజులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని శనివారం పలువురు కలసి ఘనంగా సన్మా నించి ధన్యవాదాలు తెలిపారు. పలమనేరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయ వాది మునిరాజులు మంగళవారం నియమితులై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనకు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని న్యాయవాది మునిరాజులు తన అనుచరులతో ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి గజమాలతో సన్మానించారు. తనపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మునిరాజు పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌కు, కమిషనర్‌కు ఆయన ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు రవి, సుబ్బరామయ్య, బాబు రెడ్డి, చంద్రశేఖర్, తిప్పారెడ్డి, మునెప్ప, సురేష్, గోపి పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుల సన్మానం

ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ వారు సన్మానించారు. టిడిపి ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతులు తమ పొలాల్లో వీలైనన్ని ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని శనివారం చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు గ్రామ పంచాయతీ తెల్లగుండ్లవలస గ్రామంలో ఉపాధి పనుల్లో భాగంగా పంట సంజీవి ఇంకుడు గుంతల తవ్వకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షపు నీటిని సంరక్షించుకోవడం ద్వారా సాగునీటికి కొరత లేకుండా వుంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాల అడుగంటు తున్నాయని.. ఇందుకోసం అనువైన ప్రాంతాల్లో వీలైనన్ని ఇంకుడు గుంతలను తవ్వాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని కలిసి విన్నవించామని రోడ్ల మంజూరుకు స్పందించా రన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, ఏపీడీ సుబ్రహ్మణ్యం, మండల అధికారులు, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, మండల పార్టీ అధ్యక్షులు శశికర్ బాబు, నాయకులు హరిబాబు, జగదీశ్వర్ నాయుడు, మేషక్, మోహన్ రాజ్, సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపిడివో నారాయణ

ప్రజాశక్తి -సోమల: మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు సచివాలయంలో ఎంపీడీవో నారాయణ శనివారం రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని గ్రామస్తులకు తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్ డి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం : మండలం లోని కొమరకుంట పచ్చికా పల్లం గ్రామ సచివాలయంను డీపీవో సుధాకర్ రావు సందర్శించారు. శనివారం కొమరకుంట సచివాలయంలో శానిటేషన్, తాగునీరు పారిశుద్ధ్య పనులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం పచ్చికాపల్లం సచివా లయంలో రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరుపై ఆరాతీశారు. ఈ కార్యక్రమం లో ఇఒపిఆర్‌డి పురుషోత్తం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో

న్యాయం చేయండి..

బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి -పూతల పట్టు : 'అమర్ రాజా రాజన్న ట్రస్ట్' పేరుతో భూదందాకు పాల్పడుతున్న వారి నుండి తమకు న్యాయం చేయాలని తవణంపల్లి మండలం దిగువ మాగం గ్రామానికి చెందిన గోపికృష్ణ, డాక్టర్ వైవి హరిష్ చంద్రలు మీడియాను ఆశ్రయించారు. శనివారం తవణంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితుడు గోపికృష్ణ మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి ఉన్న ఎకరా 50సెంట్లు భూమిలో వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. తమ భూమిలోని అమర్ రాజా స్కూల్ భవనం నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని యాజమాన్యానికి తెలిపినా పట్టించు కోలేదని వాపోయారు. కనీసం నష్టపరిహారం చెల్లించాలంటూ రెవెన్యూ అధికారులకు విన్నవించడంతో 2018 సంవత్సరంలో 145 సెక్షన్ విధించారని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ వినతిపత్రం అందించామన్నారు. 145 సెక్షన్‌ను ఎత్తివేసి నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు అధికారులు పట్టించు కోలేదని వాపో యారు. లోకాయుక్తను ఆశ్రయిం చడంతో విజిలెన్స్ అధికారులు కూడా దీనిపై చర్యలు తీసుకోవాలని నివేదికలు ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని వాపోయారు. డాక్టర్ హరిశ్చంద్ర మాట్లాడుతూ తమకు ఉన్న ఎకరం 30 సెంట్ల భూమిలో మూడు అంతస్తుల భవనం నిర్మించారని మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి కుటుంబం దౌర్జన్యం రోజురోజుకు మితి మీరిపోతోందన్నారు. పలుమార్లు తమపై దాడులకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. గ్రామంలోని ఇంకా దీపా, వికాస్, నరేంద్రబాబులు భూములను కోల్పోయారని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని లేని పక్షంలో నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు .

మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి -గుడిపాల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గుడిపాల మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు చెన్నై నుండి చిత్తూరు వైపు వెళు తున్న ఏపీ 16 టిఎస్ 3909 నెంబరు టొయోట కారు, చిత్తూరు నుండి చెన్నై వైపు వెళుతున్న ఏపీ 03పి 2867 నెంబరు ద్విచక్రవాహనాన్ని గ(త్రా)ల మిట్ట బస్టాప్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్, సర్గుణనేషన్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తమిళనాడు సేర్కాడుకు చెందిన సర్గుణ నేషన్ మృతి చెందాడు. శేఖర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకులను ఢీకొన్న కారు

ముగ్గురికి గాయాలు

కారు ఢీకొని నుజ్జునుజ్జు అయిన స్కూటర్లు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : రెండు బైకులను కారు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నాయుడు పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీపతి (43) ఎస్ఆర్ పురం మండల కేంద్రం నుండి ద్విచక్ర వాహనంపై శనివారం స్వగ్రామానికి బయలు దేరాడు. చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారి ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ ను సమీపిస్తుండగా నాయుడుపల్లి వద్ద వెనుక వస్తున్న కారు ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న ఏఎం పురం మహిళా పోలీస్ సునీత, అతని భర్త పార్థసారథి తీవ్రంగా గాయ పడ్డారు. గాయపడిన వారికి ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 సాయంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న నారాయణస్వామి

క్షతగాత్రులకు పరామర్శ

ఘటనపై నారాయణస్వామి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

శ్రీరంగ రాజపురం మండలంలోని పొద ల పల్లి క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకున్న ట్రాక్టర్ బోల్తా పడిన రోడ్డు ప్రమాద ఘటనపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెదురుకుప్పం మండలం యన మలమంద గ్రామానికి చెందిన 30 మందికి ఈ ప్రమాదంలో గాయా లయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కె నారాయణస్వామి ఫోన్ ద్వారా క్షతగాత్రులను పరామర్శిం చారు. వేలూరు సిఎంసిలో ఉన్న మహిళ ఆరోగ్య పరిస్థితిని స్థానిక వైద్యులను అడిగి తెలుసు కున్నారు. తీవ్రంగా గాయపడిన మహిళలకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. చిత్తూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రు లను పరామర్శించి ఓదార్చారు. అక్కడ ఎజిఎం నరేష్ రెడ్డితో మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడి మరింత మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. తిరుపతి స్విమ్స్ ఎమర్జెనీలో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రులను ఫోన్ ద్వారా పరామర్శించారు. వైద్యం అందించాలని స్విమ్స్ డైరెక్టర్ ను కోరారు. డియం అండ్ హెచ్ ఓ సుధారాణితో మాట్లాడి క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

సంప్రదాయ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా సంప్రదాయ దినోత్సవం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ :

కుప్పం మండలంలోని బిసిఎన్ విద్యా సంస్థలలో భాగమైన కుప్పం ఇంజ నీరింగ్ కళాశాలలో శనివా రం సంప్రదాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతున్న భారత దేశంలో విభిన్న మతాలు, విభిన్న జాతులు, పలు రకాల సంస్కృతులను, సంప్రదాయాలను పాటిస్తున్నాయని తెలిపారు. వీటిని నేటి తరం యువతకు తెలిపేందుకే సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులందరూ విభిన్న సంస్కృతులు ప్రతిబింబించేలా వస్త్ర ధారణతో కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టరు సునీల్ రాజ్, కళాశాల సీఈఓ సాగర్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కరన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీయుత ప్రధాన జిల్లా జడ్జి ఒంగోలు వారి కోర్టులో
M.V. O.P. No. 11/2023
పెదనబోయిన వెంకటేశ్వర రెడ్డి మరియు ఇతరులు
... పిటిషనర్స్
Vs
యస్.శంకర్ మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్
నోటీసు
To
R2.)
జగనాథన్ సురేష్ కుమార్ S/o జగనాథన్
లారీ ఓనర్ AP 03/U 8440,
డోర్ నెం. 21, ఆటో నగర్,
చిత్తూరు-517001. ఆంధ్ర ప్రదేశ్
పై M.V.O.P.No.11/2023లో పిటిషనర్లు నష్టపరిహారం కొరకు మీపై దావా వేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం అనేక పర్యాయములు కోర్టు ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ద్వారా మీకు నోటీసు తెలియపర్చడమైనది. కావున మీరు తేదీ 28-03-2025న ఉదయం 10 గం.30 ని.లకు పైకోర్టులో స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసినది లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ చేయటమైనది.
// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ : 28-3-2025.
ఇట్లు
జి.బాలాజీ రావు
అడ్వొకేట్, ఒంగోలు.